# గొడుగు నీడ

కార్తీకమాసపు చలి జివ్వుమంటోంది ఆ తెల్లవారుజామున.

అప్పుడు సరిగ్గా అయిదు గంటలు దాటి అరగంట అయింది. ఇంకా చీకటిని చుట్టేసిన మంచు పరిసరాలను ఒణికిస్తోంది.

శంకర్‌విలాస్ సెంటర్‌లో హైద్రాబాద్‌నుండి వచ్చిన బస్సుదిగి, చేతిలో సూట్కేసుతో రోడ్డు మీద నడుస్తున్నాడు వెంకట సుందర సత్య రమణమూర్తి.

ఆరడుగుల పొడుగు. పొడుక్కు తగ్గ లావు. తెలుపు, నీలం రంగు చారల పొడుగు చేతుల స్వెట్టరు. బాగా నెరిసి పలచబడిన జుట్టును బస్సు దిగేముందు దువ్వుకోవటంతో నున్నగా తల. పచ్చటి శరీరం.

బస్సు దిగి నలువైపులా చూచాడు హుందాగా. రోడ్డుకు ఓ మూలగా మురుగు కాలువ వంతెన పక్కగా మాసిన గుడ్డలు ముసుగుగా కప్పుకొని చలిమంట వేసుకుంటున్న మనుష్యులు... ఉండి ఉండి హారన్లు మ్రోగించుకుంటూ బ్రిడ్జిమీద నుంచి దూసుకు వస్తున్న ఆటోలు. తను ఎక్కుతాడేమోనని ఆశగా చూస్తున్న రిక్షామనిషి.

గుంటూరు చాలా మారిపోయింది. ఫ్లోరోసెంట్ బలుబులతో సిమెంటురోడ్లు దేదీప్యమానంగా వెలిగి పోతున్నయి... కొత్తగా రంగులు వేసిన రోడ్డు డివైడరు.

ముప్పయి సంవత్సరాల క్రితం– జానకితో తన పెళ్ళయిన కొత్తల్లో ఒకటి రెండు సార్లు వచ్చాడు. అప్పుడు ఇన్ని మేడలెక్కడున్నయి. ఇన్ని కొట్లు ఎక్కడున్నయి. ఇన్ని దీపాలు ఎక్కడున్నయి. ఇంత విశాలంగా రోడ్లెక్కడున్నయి.

రిక్షా అతని వంక చూచాడు. అతడు ఉత్సాహంగా ముందుకు లాగాడు రిక్షాను.

"ఇక్కడ మంచి లాడ్జి ఎక్కడున్నది?"

అతడు నీరసంగా అన్నాడు. "మొదటి అడ్డరోడ్డులోనే శంకర్ విలాస్ వాళ్ళదే వున్నది... అటు వెళ్ళండి!"

చేతిలో సూట్కేసుతో అతడు చూపించిన వైపు అడుగులు వేయసాగాడు.

శశిరేఖ పెళ్ళి ఎనిమిది గంటల యిరవై ఆరు నిముషాలకు.

జరుగుతున్నది బ్రాడీపేట రెండో లైనులో వున్న ఓంకార క్షేత్రంలో.

శశిరేఖ స్వయాన తన కూతురు!

✣ ✣ ✣

వెంకట సుందర సత్య రమణమూర్తి హైదరాబాద్‌లో ఒక పెద్ద ప్రైవేటు పారిశ్రామిక సంస్థలో చీఫ్ ఎగ్జ్యుక్యుటివ్‌గా చేసి అరవయ్యో ఏట సంవత్సరం క్రితం రిటయిరయ్యాడు.

ఏ బాదరాబందీ లేని జీవితం. లేవటం- ప్రతిదీ పని వాళ్ళు అమరుస్తుంటే అందుకుంటూ స్వంత యింట్లో బ్రతకటం.

మూడురోజుల క్రితం మధ్యాహ్నం పన్నెండు గంటలప్పుడు వచ్చిన ఆ శుభలేఖ అతడిని గతకాలపు ఆలోచనలతో ఉక్కిరిబిక్కిరి చేసింది.

అందులో ఇలా వున్నది.

"నా సోదరుడు వెంకట సుందర సత్య రమణమూర్తి ఏకైక కుమార్తె శశిరేఖను ఇచ్చి..." తరువాత చదవటానికి కళ్ళు మసకలు బారటంతో ఆవేశమొచ్చింది. ఏకైక కుమార్తె ఏంవిటి... తనకు ఇంకో కూతురు వున్నది... ఇంకో కొడుకు వున్నాడు...

శుభలేఖ చివరలో చూచాడు- 'విశ్వనాథం' అని వున్నది.

విశ్వనాథం ఎవరో తనకు తెలియదు!

నిట్టనిలారుగా కూర్చున్నాడు. ఆ కార్డు అటూయిటూ తిప్పి చూచాడు- ఆ విశ్వనాథం ఫోను నంబరు వున్నదేమో నన్నట్లుగా... అదెక్కడా లేదు!

పెళ్లి సరిగ్గా ఆనాటికి మూడో రోజున ఉదయం ఎనిమిది గంటల యిరవై ఆరు నిముషాలకు!

అంటే- తను ఆ పెళ్ళికి వెళ్ళాలీ అంటే ఎల్లుండి రాత్రికే బయిల్దేరాలి!

వరుడు ఎవరో నన్నట్లుగా చూచాడు.

'సుధీర్...సాఫ్ట్‌వేర్ ఇంజనీర్...డెట్రాయిట్!'

మహా చికాకు వేసింది ఇంగ్లీషులో వున్న ఆ ఉద్యోగ వివరాల అక్షరాలు చూడగానే.

అమెరికా, భారతదేశపు ఎన్నో కుటుంబాలలోని పెద్దల విషయంలో, పిల్లల బాధ్యతలను అపహరించి వేస్తున్నది- విసుగ్గా ఆ కార్డును దూరంగా విసిరివేశాడు రమణమూర్తి!

ఈ విదేశీ యావలో కుర్రాళ్లు విమానాలు ఎక్కుతుంటే ముసలి తల్లిదండ్రులు- ఎంత డబ్బున్నా- నా అన్నవాళ్ళు లేని అనాథలయి... ఛ! ఛ!...

ఒకరోజు తన మిత్రుడు ఓ మాట అన్నాడు: "మా అమ్మాయికి నీకు బాగా తెలిసిన అమెరికా సంబంధం వుంటే చెప్పవయ్యా రమణమూర్తీ!" అని.

తను గంటసేపు క్లాసు తీసుకున్నాడు.

ఆయన నవ్వుకుంటూ తన భుజంతట్టి వెళుతున్నప్పుడు గాని తను ఎంత తొందరపాటుతో వాగిందీ అర్థం కాలేదు.

రెండుసంవత్సరాల క్రితం కూతురు, ఆరునెలల క్రితం కొడుకు అదే బాటన తనని ఒంటరిగా వదిలేసి విమానా లెక్కారు... కృతఘ్నులు!

కొడుకు లాజిక్కు: "నువ్వు నలభై ఏళ్ళ క్రితం తాతయ్యను, బామ్మను వదిలి చీరాలనుంచి హైదరాబాదు జేరావు- వాళ్ళు ఎంత వద్దని మొత్తుకుంటున్నా వినకుండా... ఎందుకు చేశావు ఆపని... నీ భవిష్యత్తు బాగుండాలని... అదే ఇప్పుడు నేను చేస్తున్నది... హైదరాబాద్ వదిలి అమెరికా వెళుతున్నదీను!"

"మా నాన్న చస్తే నేను వెళ్ళి కొరివి పెట్టానురా కొద్ది గంటల్లోనే!"

"ఈ రోజుల్లోనూ ఆలాంటి ఇబ్బందులేం లేవు నాన్నా... చాలా ఆసుపత్రులు ఆ శవాల్ని ఎన్నాళ్ళు కావాలంటే అన్నాళ్ళు పాడయిపోకుండా అద్దాల పెట్టెల్లో పెట్టివుంచి బహు జాగ్రత్తగా అందిస్తున్నారు, విదేశాలలో వున్న పిల్లలు రాగానే! ఎందుకు నాన్నా ఈ మాటలన్నీ... నువ్వు మాతోపాటు వస్తావా ఆనందం... లేదా ఇక్కడ సంపాదించుకున్న నీ బోడి ఆస్తికి సెక్యూరిటీ గార్డులా పడివుంటానంటావా నీ యిష్టం!"

త్రాష్టుడు!

ఎదురుగ్గా మరింత చికాకు కలిగిస్తూ శుభలేఖ.

తను ఈ పెళ్ళికి వెళ్ళాలా వద్దా?

శుభలేఖ పోస్టుచేసి మౌనంగా వుండిపోయింది జానకి... కనీసం మాట మాత్రమయినా ఫోను చేసి చెప్పవచ్చు గదా!

పాతికేళ్ళ క్రితం పసిపిల్లతో సహా ఇంటినుంచి పంపివేయబడ్డ ఆమె- తనకు అసలు శుభలేఖ పంపటమే మహా ఘనం అనుకుంటున్నదేమో!

తను విడాకులు ఇవ్వలేదు. ఆమె అడగనూ లేదు. అడిగితే నెలకు ఎంతో కొంత డబ్బు ఇద్దామనుకున్నాడు. ఎవరి భరణం మీదా నేను బ్రతకను అని భీష్మించుకొని ఎమ్.ఎ. చదివి, లెక్చరర్ అయి తన జీవితాన్ని తనే నెట్టుకు వస్తున్నదని తనకు తెలుసు.

ఆవిడగారి గీర్వాణం అదే!

ఆ బోడి మగవాడనే మొగుడు ఆధారం లేకుండా నేను బ్రతకలేనా అని!

కళ్ళు మూసుకొని, కాళ్ళు జాపుకొని ఆ సోఫాలో చాలాసేపు పడుకున్నాడు రమణమూర్తి!

టుగో ఆర్ నాట్ టుగో... ఎదురుగ్గా టీపాయ్ మీద పెట్టుకున్న కాళ్ళు అతడి మనస్సులాగానే అటూయిటూ ఊగుతున్నాయి.

వెళ్దాం... జానకిని చూచి యిరవయి అయిదు సంవత్సరాలయింది... శశిరేఖను నెలల పిల్లగా చూచాడు!

అమ్మకున్నంత పొగరు కూతురుకు గూడా వచ్చిందేమో చూడాలి.

పొగరు... పొగరు... ఆలోచనలు- తననుండి పైసా ఆశించకుండా తన కాళ్ళమీద తను- తను వదిలేసినా నిలబడ గలిగింది ఆ పొగరు వుండబట్టే... మాటా మాటా వచ్చి, నువ్వు ఇంట్లో నుంచి, ముందు నా ముందు నుంచి వెళ్ళిపో అని అంటే- బ్రతిమలాడటం వదిలేయ్... కంటతడి గూడా పెట్టకుండా వెంటనే వెళ్ళిపోయిందీ అంటే దానికి ఎంత పొగరో తనకు తెలుసు. తను జాహ్నవితో తిరుగుతున్నానని తెలిసినా- తన బ్రతుకును బండలు చేయవద్దని మాట మాత్రం గూడా అనలేదూ అంటే దాని పొగరును అంచనా వేయటం అతి కష్టం!

గూడలెగరేస్తూ లేచి నిలబడ్డాడు రమణమూర్తి.

ఫోను దగ్గరకు వెళ్ళి ట్రావెల్ ఏజంటుకు ఫోను చేశాడు- గుంటూరు వెళ్ళే ఏసీ బస్సుకు తనకు ఏ రోజుకు టిక్కెట్టు కావాలో చెప్పాడు. తిరిగి వచ్చేటందుకు ట్రైన్‌లో మరునాడు రాత్రి నర్సాపూర్ ఎక్స్‌ప్రెస్‌కు, టూటైర్ ఏసీలో తీసుకొని ఇంటికి పంపమన్నాడు. రెండు రాత్రిళ్ళు వరసగా బస్సులో కూర్చొని తను ప్రయాణం చేయలేదు.

చలికాలంలో తను ఏసీ బస్సులో వచ్చానని తెలిస్తే జానకి అనుకోవచ్చు- అది తన పొగరని! అనుకోనీయ్ చూద్దాం...

అసలు తను వస్తానని ఆవిడగారు ఎన్నడూ ఊహించదు... కవ్విస్తున్నట్లుగా- చూడు నన్ను వదిలేసిన మొగుడా- నీ నుండి ఏమీ ఆశించకుండా- నా కూతుర్ని పెంచి, పెద్ద చేసి ఎంత ఘనంగా అమెరికా సంబంధం చేస్తున్నానో- ఒక్కసారి వచ్చి చూచి తరించి వెళ్ళు అన్నట్లుగా- ఆ శుభలేఖను బుక్‌పోస్టులో నాలుగు రూపాయిల స్టాంపు అంటించి విసిరి పడేసింది...

కానీయ్... ఈనాడు అదెంత ఘనంగా వున్నదో అదీ చూసి వద్దాం...

టైం చూచుకున్నాడు- ఏసీ ఆన్ చేసి వున్న ఆ హోటల్ గదిలో కూర్చొని వేడి వేడి కాఫీ త్రాగుతూ ఆలోచిస్తున్నాడు రమణమూర్తి.

ఆరుపైన అరగంట అయింది... తను గుంటూరు వచ్చి అప్పుడే గంట దాటింది!

కాఫీ త్రాగి స్నానం చేశాడు. గచ్చకాయ రంగు సూటు వేసుకున్నాడు. టై కట్టుకున్నాడు. ఉన్న కొద్దిపాటి వెంట్రుకలనీ నున్నగా దువ్వుకొని మొహానికి పౌడరు రాసుకున్నాడు. డెనిమ్‌ను చంకల క్రింద స్ప్రే చేసుకొని కోటు తొడుక్కున్నాడు. డ్రెస్సింగ్ టేబుల్ ముందు నిలబడి తెల్లబడ్డ మీసాలను సరిచేసుకున్నాడు.

పెట్టె తెరిచి కూతురుకు కొన్న చిన్న బంగారు లక్ష్మి బొమ్మను కోటు జేబులో పెట్టుకున్నాడు.

జానకి తనను గుర్తు పడుతుందా? అసలు జానకిని తను గుర్తు పడతాడా?

తను ఇలా రావటం ఆమెకు పెద్ద సర్‌ప్రయిజ్ అవ్వాలి! షాక్ అవ్వాలి... కళ్ళు పెద్దవి చేసుకొని తనను చూస్తుంటే...

రూంకు తాళం వేసి లిఫ్టులో క్రిందకు దిగాడు. గేటు దగ్గరున్న ఆటో ఎక్కి ఎక్కడికి వెళ్ళాలో చెప్పాడు.

నాలుగో లైను బాగా విశాలమయింది. అటూ యిటూ బంగారు కొట్లు... తను పూర్వం చూచినప్పుడు మధ్యలో చిన్న రోడ్డు... రెండు వైపులా మురుక్కాలవ...

ఆటో ముందుకు దూసుకు పోతోంది.

తనని అక్కడ ఎవ్వరూ గుర్తుకు పట్టకపోతే... జానకి ఎక్కడ వున్నదో అడిగి మరీ వెళ్ళి పలకరిస్తాడు... కొద్ది సంవత్సరాలే అయినా తనతో కాపురంచేసింది- ఆ మాత్రం

గుర్తు పట్టలేక పోతుందా!... వయస్సుతో పాటు ఆడవాళ్ళ రూపం మారినట్లు మగవాళ్ళు మారతారని తను అనుకోడు... అప్పుడయితే తనకి నెత్తిన నొక్కుల నొక్కుల జుట్టు వుండేది... ఇప్పుడు బాగా పలచబడి తల నున్న బడిపోయింది.

ఆలోచనలలో ఉండగానే ఆటో ఆగింది.

సన్నాయి మేళం మధురంగా అక్కడే పెళ్ళి జరుగుతున్నదన్నట్లుగా వినబడుతున్నది.

గేటు దగ్గర ఆహ్వానపు ఆర్చీ బంతిపూలతో అమర్చి వుంది. 'శశిరేఖ వెడ్స్ సుధీర్'

ఆటో అతనికి డబ్బులిచ్చి పంపి గేటులోనుంచి లోపల కాలు పెట్టాడు.

చిన్నపిల్లలు... పరికిణా, ఓణీలల్లో తెల్లని పలువరసతో ఆహ్వానిస్తూ ఓ గులాబీని చేతికిచ్చారు... పన్నీరు చల్లారు.

"ఫైన్! థాంక్యూ!"

లోపలికి వచ్చాడు.

పెద్ద షామియానా. అంతా కుర్చీలు. ఎదురుగ్గా వధూవరులు కూర్చునేటందుకు ఎత్తు బల్లలతో వేదిక...

కుర్చీలలో అక్కడక్కడా కొందరు కూర్చుని వున్నారు.

టైం చూచుకున్నాడు. ఏడున్నర అయింది.

ఎటు చూచినా తెలిసిన ముఖం ఒక్కటీ కనబడటం లేదు. అంతా తనకంటే చిన్నవాళ్ళే. పెద్దవాళ్ళు ఒకళ్ళిద్దరు వున్నా కుర్చీలల్లో ముడుచుకొని కూర్చొని వున్నారు.

క్షణం ఏం చేయాలో అర్థం కానట్లుగా అటూ యిటూ చూచి ముందుకు వెళ్ళి ముందు వరసలో వున్న కుర్చీలో కూర్చున్నాడు.

ఎవరో సిల్కు లాల్చీలో వున్న ఒకతను వచ్చాడు: "టిఫెన్ చేద్దురుగాని రండి!" అంటూ ఆహ్వానించాడు.

ఎవరొచ్చినా టిఫెన్‌కు ఆహ్వానించమని అతడికి డ్యూటీ వేసి వుంటుంది జానకి!

"అయింది!" అన్నాడు రమణమూర్తి ముక్తసరిగా. 'విశ్వనాథంగారు ఎక్కడ?' అని అడుగుదామనుకొని నాలిక చివరిదాకా వచ్చిన ఆ మాటను గుటుక్కున మ్రింగివేశాడు. తను వెళ్ళి వాళ్ళముందు నిలబడి తనని తాను పరిచయం చేసుకోవటం తనకిష్టంలేదు. లగ్నానికి ఇంకా గంట టైంవున్నది. ఎవరో ఒకరు తనని ఈలోగా గుర్తు పట్టకపోతారా?

అసలు జానకి బయిటకు వచ్చినప్పుడయినా తనని చూడదా?

స్టేజీమీద కెక్కిన బ్రహ్మగారు కేకలు వేస్తున్నారు: "ఎంతసేపు... వెంటనే రావాలి... టైం చాలదు!" అంటూ.

పిలుపులు... పరుగులు...

కంచి పట్టుచీరలో తలనిండా పూలు పెట్టుకొని, ముఖాన రూపాయంత బొట్టుతో ఓ స్త్రీ హడావుడిగా స్టేజీ మీదకు వచ్చి బ్రహ్మగారికి ఏదో చెప్పి వెళ్ళిపోయింది.

చూస్తే- ఆ నడకా, పోలికా జానకిలాగానే వున్నది. తనతో పాటు వున్నప్పుడు ఆమె చాలా సన్నగా వుండేది. ఇప్పుడు లావెక్కింది. జుట్టును చుట్టగా చుట్టుకున్నది. కళ్ళకు బంగారు రంగు ఫ్రేము కళ్ళజోడు. ఆమె మాట వినబడలేదు - కంఠాన్ని బట్టి అయినా నిర్ధారించుకోవచ్చు అనుకున్నా.

ఆహ్వానితులు వస్తున్నారు. గేటు ముందు కార్లు ఆగుతున్నయి. ఆటోలు ఆగుతున్నయి. పట్టు చీరలు రెపరెప లాడుతున్నయి. నవ్వులు. కేరింతలు. పలకరింపులు. కౌగిలింతలు- ఎన్నాళ్ళకెన్నాళ్ళకు- అన్నట్లుగా.

ఫరవాలేదు- జానకి బంధువర్గాన్ని బాగానే పెంచుకున్నది.

ఆ స్త్రీయే తరువాత కొద్ది నిముషాలకు స్టేజీ పక్కనుంచి క్రిందకు వచ్చి కుర్చీల ముందునుంచి అవతల వైపుకు త్వరత్వరగా వెళుతూ సూటులో వున్న రమణమూర్తిని ఎవరా అన్నట్లుగా ఒక్కసారి క్రీగంట చూచి- అనుమానంరాగా చటుక్కున ఆగి కళ్ళు చికిలించింది.

వెంకట సుందర సత్య రమణమూర్తి కళ్ళు మూస్తూ తెరుస్తూ 'నేనే'నన్నట్లుగా నవ్వాడు. అతడు గుర్తించాడు ఆమెను జానకిగా.

"మీరు...మీరు..." ఆమె అప్రతిభురాలయింది. "వచ్చారా మీరు?" ఆనందంతో, ఆవేశంతో అన్నది.

"నువ్వు పోస్టులో పంపిన శుభలేఖ అందింది!" అన్నాడు పెదవి విరిచి కొంటెగా నవ్వుతూ.

"రండి...రండి!" అన్నది తడబడుతూ. వెనక్కు తిరిగింది. అటు ఎందుకు వచ్చిందో గూడా మరిచిపోయింది. "లోపలకు రండి!"

"ఫరవాలేదు... ఇక్కడ బాగానే వున్నది!" అన్నాడు లేవకుండానే. "లగ్నం దగ్గరపడుతున్నది... ముందు ఆ పనులు కానివ్వు!"

"మన అమ్మాయిని చూద్దురుగాని రండి!" అన్నది ఆమె ఆగకుండానే.

ఎందుకో ఆమె కాళ్ళు వణుకుతున్నయి. చేతులు వణుకుతున్నయి. కంఠం వణుకుతున్నది.

ఒక్కసారి గూడలెగరేసి లేచి ఆమె వెనగ్గా నడవటం మొదలుపెట్టాడు రమణమూర్తి.

ఆమె వివాహమంటపానికి పక్కగా వున్న చిన్న గదిముందు నిలబడి ఆయన వస్తున్నారా లేదా అన్నట్లుగా ఆగి వెనక్కు తిరిగి చూచింది.

సరిగ్గా తన వెనకాలే నిలబడి వున్న భర్తను చూచి తత్తరపడింది.

"రండి...రండి!" గడపవతలకు ఒక్క దూకు దూకింది.

రమణమూర్తి లోపల కాలుపెట్టాడు.

అక్కడ- ఆ చిన్న గదిలో- చేతిలో కుంకుమతో గౌరీపూజ చేస్తున్నది శశిరేఖ.

అలికిడికి తలెత్తి ఇద్దరివంకా చూచింది. తల్లి పక్కన అంతకు ముందు తను ఎన్నడూ చూడని కొత్త మనిషి!

జానకి కూతురుకి దగ్గరిగా ముందుకు వంగి, "మీ నాన్న!" అన్నది.

చివ్వున తలెత్తి తండ్రి వంక చూచింది శశిరేఖ. తనకు ఊహ తెలిసిన తరువాత మొదటిసారిగా చూస్తున్నది తండ్రిని. ఆమె శరీరంలోని రక్తమంతా ఒక్కసారిగా ముఖంలోకి చిమ్మినట్లయింది.

అమ్మవారి మీద వేస్తున్న ఎర్రటి కుంకుమ ఆగిపోయింది.

రమణమూర్తి చిరునవ్వుతో కూతురు వంక చూచాడు.

"నమస్కారం పెట్టు!" జానకి అన్నది కూతురితో.

శశిరేఖ ఆ మాట వినిపించుకోనట్లుగానే ముఖం దేవుడి ఫోటోలవైపుకు తిప్పి- ఏంవీ జరగనట్లుగానే కుంకుమ చల్లసాగింది.

కూతురి తీరుకు జానకి ముఖం తెల్లగా పాలిపోయింది.

రమణమూర్తి ఎంతగా నిగ్రహించుకున్నా గుండె లోతుల్లోనుంచి వస్తున్న నిట్టూర్పును ఆపుకోలేకపోయాడు.

కోటు జేబులోనుంచి బంగారు లక్ష్మి విగ్రహం వున్న మొహమల్ పెట్టెతీసి జానకికి ఇస్తూ, "ఇది పూజలో పెట్టించు!" అంటూ చటుక్కున వెనక్కు తిరిగాడు.

"అదేమిటి...లగ్నానికి వుండరా మీరు?" ఖంగారుగా అడిగింది.

"ఉంటాను!" బయిటకు వచ్చేశాడు.

మరుక్షణంలోనే ఆ కల్యాణమంటపంలో అందరి నోళ్ళలోనూ అదేమాట అయింది. 'జానకి భర్త వచ్చాడు... శశిరేఖ తండ్రి వచ్చాడు!' అంటూ.

ప్రతివాళ్ళూ అతడికి అతి దగ్గరిగా నడుస్తూ చూచేవాళ్ళే. ఆ చూపుల్లో ఇంకా ఇంకా చూడాలనే ఆకాంక్ష. రెప్పలార్పని వాళ్ళ చూపులను కాస్త ఇబ్బందిగా చూస్తూ తల వంచుకున్నాడు రమణమూర్తి.

తరువాత పది నిముషాలల్లోనే పట్టుబట్టల్లో వున్న ఓ వ్యక్తి– యాభై ఏళ్ళుంటయి– త్వరత్వరగా జారిపోతున్న ఉత్తరీయాన్ని సర్దుకుంటూ వచ్చి రమణమూర్తి ముందు నిలబడ్డాడు.

"నమస్కారమండీ! నా పేరు విశ్వనాథం... శశిరేఖకు బాబాయినవుతాను... మీరు లేచి పట్టుబట్టలు కట్టుకుంటే పీటల మీద కూర్చోవచ్చు!" అన్నాడు రెండు చేతులూ జోడించి.

రమణమూర్తి ఆయన మాటలకు ఉక్కిరిబిక్కిరి అయ్యాడు కొద్ది క్షణాలపాటు.

కోలుకున్న వెంటనే లేచి నిలబడి ఆయన చేతులు పట్టుకుంటూ, "కానీయండి... మీరు కూర్చుంటేనే బాగుంటుంది!" అన్నాడు చిరునవ్వుతో.

"కాదు కాదు... మీరు వచ్చారు ఎంతో సంతోషంగా వున్నది... మీరు కూర్చోవటమే భావ్యం... పదండి!"

రమణమూర్తి తిరిగి కుర్చీలో కూర్చుంటూ, "ఫరవాలేదు... శ్రేయోభిలాషులు ఎవరు కూర్చున్నా అది శుభాన్నే చేకూరుస్తుంది... నన్ను ఒత్తిడి చేయవద్దు... ప్లీజ్!" అన్నాడు నొక్కినొక్కి చెబుతూ. "సమయం దగ్గర పడుతున్నది... ఇలాంటి ఫార్మాలటీస్‌తో కాలం వృథా చేయకండి!"

ఆయన నిరాశగా వెనక్కు తిరుగుతుండగానే రమణమూర్తి అనుకున్నాడు– 'జానకే అడిగించిందా తనను ఆహ్వానించమని ... ఆమే అడగవచ్చు గదా... ఆమె అడిగితే తను లేచి వెళ్ళేవాడా?– అది వేరే సంగతి... ఆమెలో పొగరు ఆమెను అడగనిచ్చి వుండదు...

విశ్వనాథమే మొహమాటంతో నలుగురూ ఏమనుకుంటారోనని వచ్చి అది ప్రతి పాదించాడేమో!'

తను మంచి పనే చేశాడు- తిరస్కరించి!

పెళ్ళికొడుకు వచ్చి పీటల మీద కూర్చున్నాడు. కుర్రవాడు బాగానే వున్నాడు.

మంగళవాయిద్యాలు చెవులకింపుగా మ్రోగుతున్నాయి.

బ్రహ్మగారి మంత్రఘోష మైకులో పందిరి అంతా ప్రతిధ్వనిస్తోంది.

ఓ ముసలాయన వచ్చి రమణమూర్తి పక్కన కూర్చుంటూనే, "నేను గుర్తున్నానా నాయినా!... మీ పెదమామగారిని... మీ మామగారు పోయినా శశిరేఖ వివాహం చూడటానికే ఇంకా నేను బ్రతికివున్నాను!" అన్నారు.

"నమస్కారమండీ!"

"ఎప్పుడొచ్చావయ్యా?"

"పొద్దున వచ్చానండీ!"

"హైదరాబాద్‌లోనేనా వుండటం?"

"అవునండీ!"

"అక్కడంతా కులాసానా?"

"కులాసానేనండీ!"

ఇందాకటి సిల్కులాల్చీ అతనే ఓ కూల్‌డ్రింక్ బాటిల్ తెచ్చి రమణమూర్తికి ఇచ్చాడు. చుట్టూ చూచాడు. ఎవరి చేతుల్లోనూ లేవు. జానకి తెప్పించి తనకు పంపి వుంటుంది. పక్కన పెద్దాయనకు ఇవ్వకుండా తను త్రాగటం మర్యాద కాదన్నట్లుగా, "మీరు తీసుకోండి!" అన్నాడు సీసా ఆయనకిస్తూ.

"వద్దు... వద్దు... చల్లటివి త్రాగలేను... నువ్వు తీసుకో... అరేయ్ భద్రం- నాకో కాఫీ, పంచదార వేయకుండా చేయించి, పట్టుకురారా!" అన్నాడు ఆ సీసా తెచ్చిన కుర్రవాడితో.

సరిగ్గా ఎనిమిది గంటల యిరవై ఆరు నిముషాలకు మేళతాళాలు చెవులలో హోరెత్తిస్తుండగా శశిరేఖ సుధీర్‌కు ధర్మపత్ని అయింది!

పెళ్ళికూతుర్ని లోపలకు తీసుకువెళ్ళారు మధుపర్కాలు కట్టించేందుకు.

జానకి పరుగెత్తుకుంటూ వచ్చింది రమణమూర్తి దగ్గరకు. "మీరు భోజనం చేయకుండా వెళ్ళేరు!" అన్నది ఆదుర్దాగా.

"ఎందుకు అనుకుంటున్నావు అలా అని!" ఆమెనే చూస్తూ నవ్వాడు.

సరైన సమాధానం కోసం తడబడింది జానకి.

"వెళ్ళనులే... నీకూ, అమ్మాయికీ, అల్లుడికీ చెప్పకుండా వెళ్ళను!"

"సుధీర్ మా చిన్నాన్నగారి అబ్బాయి!"

"గుడ్... తమ్ముడేనన్న మాట!"

ఎవరో పిలిస్తే హడావుడిగా వెళ్ళిపోయింది జానకి. భర్తను చూచినప్పటినుంచి ఆమెకు తత్తరపాటు ఎక్కువయింది. ఆమె కెందుకో తెలియని ఆవేశమొస్తున్నది.

లగ్నమయిం తరువాత భర్త మంటపం పైకెక్కి నూతన దంపతులను ఆశీర్వదిస్తూ అక్షింతలు చల్లుతుంటే ఆమె కళ్ళు ఆనందంతో తడిసినయి.

భోజనాలయ్యేటప్పటికి రెండు గంటలయింది.

రమణమూర్తి ఆ పందిట్లో ఓపిగ్గా కూర్చున్నాడు కొన్ని గంటలు.

ఊళ్ళో బంధువులు చాలా వరకు వెళ్ళిపోయారు. వచ్చిన వాళ్ళందరికీ రమణమూర్తి ఒక ఆకర్షణ అయ్యాడు.

చాలా వరకు ఖాళీ అయిన ఆ షామియానాలో రమణమూర్తి, శశిరేఖ, సుధీర్, జానకి ఓ పక్కగా కూర్చొని వున్నారు.

వాళ్ళ నడుమ నిశ్శబ్దం. దానికి కత్తెర్లు వేస్తూ, కుర్చీలను తోసుకుంటూ, పడేస్తూ బంధువుల పిల్లల పరుగులు, ఆటలు, కేకలు...

శశిరేఖ మాట్లాడటంలేదు. మౌనంగా కాస్త ఇబ్బందిగా కూర్చున్నది.

"రాత్రికి వుంటారా?"

"నర్సాపూర్‌కు వెళుతున్నాను... హైద్రాబాద్‌లోనే టిక్కెట్టు తెప్పించుకున్నాను!"

దగ్గర బంధువులు ఎవరో వెళుతుంటే బొట్టుపెట్టి పండూ తాంబూలం ఇవ్వటానికి గాను లోపలకు వెళ్ళింది జానకి, "ఇప్పుడే వస్తాను!" అంటూ మేనత్త పిలవగా.

"అమ్మ మీకు ఫోను చేసిందా రమ్మనమని!" అన్నది శశిరేఖ రమణమూర్తి వంక చూస్తూ, తల్లి అటు వెళ్ళగానే.

కూతురి గొంతులో కాస్త కరుకుతనం వుండటంతో చలించాడు రమణమూర్తి. "నేను రావటం ఇబ్బందిగా వున్నదా?" సూటిగా ఆమెనే చూస్తూ అడిగాడు.

"ఛ! ఛ!... అలాంటిదేం లేదు... పెద్దలు మీ ఆశీస్సులు పొందటం మాకు చాలా ఆనందంగా వున్నది!" సుధీర్ త్వరత్వరగా అన్నాడు.

"నాకు ఊహ తెలిసిన తరువాత నేను మిమ్మల్ని చూడలేదు... నేనేమిటి... మా అమ్మ మీరు వెళ్ళగొడితే ఇంటినుంచి నన్ను భుజాన వేసుకొని బయిటకు వచ్చింతరువాత ఒక్కసారైనా చూచిందా?... చూడలేదు... అటువంటిది ఈరోజున మీకు ఎందుకు రావాలనిపించింది ఇక్కడకు?" ఆమె కళ్ళు ఎర్రబడుతున్నయి.

వెంకట సుందర సత్య రమణమూర్తి తను కన్న కూతురి మాట తీరుకు అప్రతిభుడయ్యాడు. ఏం మాట్లాడాలో తెలియనట్లుగా బిగుసుకుపోయి ఆమెనే గుడ్లప్పగించి చూస్తున్నాడు.

"పెళ్ళిపందిట్లో ప్రతివాళ్ళూ జానకిని వదిలేసిన భర్త వచ్చాడు అంటుంటే నాకెంత చిన్నతనంగా ఉన్నదో తెలుసా... ఆ మాటలు వింటున్న మా అమ్మ నలుగురి వంకా ఎంత నిస్సారంగా చూచిందో మీకు తెలుసా... అలా వున్న ఆమెను చూస్తుంటే నా కెంత బాధ వేసిందో తెలుసా... అసలు ఆ సమయంలో నేను ఎంత చిత్రహింస అనుభవించానో మీరు ఊహించగలరా?... వివాహంలోని ఆనందాన్ని వాళ్ళ మాటలు సంపూర్ణంగా హరించి వేసినయ్!" ఆమె కళ్ళు రోషంతో తడుస్తున్నయి.

రమణమూర్తి ఊపిరి అందని వాడిలా గిలగిలలాడుతున్నాడు గుండెమీద చేయివేసుకొని.

"అమ్మ ఈ ప్రపంచాన్నే జయించిన విజేతలా నన్ను పెంచింది... కానీ ఈనాడు ఆమెను కొన్ని వందల కళ్ళు జాలితో చూస్తుంటే నా గుండె పగిలిపోయింది... దీని కంతటికీ కారణం మీ రాక... ఆమెలోని గాయాన్ని అందరూ చూపుల్తోనే కాకుల్లా పొడుస్తున్నట్లు అనిపించగా... నా జీవితంలోని ఓ అత్యద్భుతమయిన ఆనంద ఘట్టంలో పీటల మీద కూర్చున్న నాకు ఆపుకోలేనంత ఏడుపు వచ్చింది!" ఆమె ఆవేశంతో ఊగిపోతున్నది.

సుధీర్, శశిరేఖ భుజంమీద చేయివేసి నొక్కుతూ, "ఏంవిటా మాటలు శశీ!... మర్యాదేనా అది... నువ్వెవ్వరితో మాట్లాడుతున్నావో తెలుసా!" అన్నాడు.

"మామయ్యా! ఇది మా ఆంతరంగిక విషయం... నీకు ఇబ్బందిగా వుంటే నువ్వు ఇక్కడ నుంచి వెళ్ళు... అంతేగాని కల్పించుకోబోకు!"

సుధీర్ కలవరపడ్డాడు– కొన్ని గంటల క్రితం తాళికట్టిన భార్య శశిరేఖ మాటలకు!

రమణమూర్తి కలవరపాటుతో కనురెప్పలు టపటపలాడించాడు కూతురు మాట తీరుకు. తను ఆ శుభలేఖ అందుకొని ఇక్కడకు వచ్చి చాలా తప్పుచేశాడా అని మొట్టమొదటి సారిగా అనిపించింది. ఆనాడు కొడుకు అమెరికా వెళ్ళిపోతానంటూ తనతో ఎంత నిర్లక్ష్యంగా మాట్లాడాడో గుర్తుకు వచ్చింది. శశిరేఖా తన రక్తం పంచుకు పుట్టిందే గదా మరి... ఏం మాట్లాడాలో తెలియనట్లుగా ఒక్కసారి గూడలెగరేసి ఊరుకున్నాడు. నేటి పిల్లల్ని తప్పు పట్టటంలో అర్థం లేదనిపించింది. వాళ్ళ పెంపకాలు అలా వున్నయి. 'ఎనీహౌ...మే గాడ్ బ్లెస్ దెమ్!' అనుకున్నాడు మనస్సులోనే ఒక్క క్షణం గట్టిగా కళ్ళు మూసుకొని.

శశిరేఖ రమణమూర్తిని అంతటితో వదిలి పెట్టలేదు. "మీ రెండో భార్యను గూడా తీసుకు వచ్చి వున్నట్లయితే... ఈ పందిట్లో జనం ఇంకా ఆసక్తిగా చూచి వుండే వాళ్ళు!" అన్నది విసురుగా. "మా అమ్మను చూచి– నీ సవితి అనుభవిస్తున్న నీ స్థానాన్ని చూడు– ఎంత గొప్పగా వున్నదో అనే వాళ్ళు!"

రమణమూర్తి బాధతో తలవంచుకున్నాడు.

తను జీవితంలో జానకికి అన్యాయం చేయలేదని అనలేడు. కాని ఇంత అవమానకరమైన పరిస్థితిని ఎదుర్కోవలసి వస్తుందని తను ఇక్కడకు బయిల్దేరే ముందే గాదు, కలలో గూడా ఊహించలేదు... మహా అయితే... ఇంకా ఆమెలో తన మీద కోపమే వుంటే... జానకి ముభావంగా రెండు మాటలు మాట్లాడి ఊరుకుంటుందనే అనుకున్నాడు గాని కూతురు– తనకు ఎవరినైతే చూడాలనిపించి వచ్చాడో– ఆ కూతురు ముఖాననే ఇంత నిక్కచ్చిగా దులిపేస్తుందని తను అనుకోలేదు!

"మీ పిన్ని రెండు సంవత్సరాల క్రితం బ్లడ్ కాన్సర్‌తో పోయిందమ్మా!" అతడి గొంతు చాలా నీరసంగా వున్నది.

దీనంగా వున్నది.

శశిరేఖ అధాట్టుగా తలెత్తింది. ఎందుకో ఆ మాట చెబుతున్న ఆయన ముఖంలోకి చూస్తుంటే ఆమె లోని కోపమంతా చప్పగా చల్లారిపోయినట్లనిపించింది.

ఓ మనిషి మరణం– వాళ్ళు ఎలాంటి వాళ్ళయినా– విన్న వాళ్ళను విచలితులను చేస్తుందనేది నిజం! అదే జరిగింది శశిరేఖ విషయంలో. తరువాత ఆమెకు నోరు పెగల్లేదు.

"సారీ...సారీ..." అన్నట్లుగా పెదవులు కదలసాగినయి.

రమణమూర్తి నలువైపులా చూచాడు ఇక అక్కడ కూర్చోలేక, జానకి కనబడుతుందేమో నన్నట్లుగా. తరువాత రెండు నిముషాలల్లోనే వస్తున్న ఆమెను చూస్తూనే లేచి నిలబడ్డాడు. "నీకూ, శశిరేఖకు అభ్యంతరం లేదూ అనుకుంటే వాళ్ళు అమెరికా వెళ్ళేలోగా ఒకసారి హైదరాబాద్ వస్తే నన్ను క్షమించినట్లుగా భావిస్తాను!" అన్నాడు క్రీగంట కూతురు ముఖంలోకి చూస్తూ.

శశిరేఖ తల వంచుకున్నది.

– సుధీర్‌కు అభ్యంతరముంటుందని తను అనుకోడు... అతడు సాత్వికుడు లాగానే వున్నాడు!

సుధీర్‌తో చేయి కలిపాడు. కూతురు భుజం మీద చేయివేసి అనునయంగా తట్టాడు. జానకి కళ్ళల్లోకి ఒక్కసారి చూచి వడివడిగా గేటువైపుకు అడుగులు వేశాడు. గేటు దాటుతూనే అక్కడ వున్న ఆటోను ఎక్కి "హోటల్ రవిశంకర్!" అన్నాడు.

* * *

రాత్రి పదకొండు గంటల యిరవై నిముషాలయింది.

గుంటూరు రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫాం మీద జానకి, శశిరేఖ, సుధీర్ నిలుచొని వున్నారు. చల్లటి గాలికి తట్టుకోవాలి అన్నట్లుగా భుజాన షాల్ కప్పుకొని వున్నది జానకి.

తండ్రితో శశిరేఖ చాలా అవమానకరంగా మాట్లాడిందని సుధీర్ ద్వారా తెలుసుకున్న జానకి ఎంతగానో బాధ పడింది. అందుకే కూతుర్ని తీసుకొని స్టేషన్‌కు వచ్చింది ఆయనను కాస్త అయినా అనునయిస్తున్నట్లుగా వుంటుంది అన్నట్లుగా.

"మనం కోచ్ నెంబరు అడగలేదు!" అన్నాడు సుధీర్ అటూయిటూ చూస్తూ.

రైలు ఇంకో పదినిముషాలల్లో వస్తున్నట్లుగా ఎనౌన్స్‌మెంటు.

"ఆయన ఏసీలోగాని ప్రయాణం చేయరులే, సుధీర్!" అన్నది జానకి నవ్వి.

"అమ్మా! నేను ఆయన్ను అన్నానని అంత కోపమొచ్చిందే... నాకిప్పుడు అనుమానం వస్తున్నది– ఆయనతో ఇన్నాళ్ళు సంసారం చేసిన రెండో భార్య పోయింది... ఆయనగారి పిల్లలు విదేశాలకు వెళ్ళిపోయారు తనని ఒంటరి వాడిని చేసి... అందుకని నిన్ను తోడుగా తీసుకువెళ్ళే ఆలోచనలతో మళ్ళా మనతో సంబంధాలు పెట్టుకునేందుకుగాను నా పెళ్ళికి రాలేదు గదా. ఆయనకు ఆలాంటి ఆలోచనవస్తే మాత్రం నీకు వెళ్ళటానికి ఇష్ట

ముంటుందేమో ఆలోచించు... ఎలాగూ మేం యిద్దరం నిన్ను ఒంటరిదాన్ని చేసేసి అమెరికా వెళ్ళిపోతున్నామని భయపడుతూ ఒకటే ఏడుస్తున్నావు గదా... అటు ఆయనకూ అదే పరిస్థితి... ముసలాళ్ళిద్దరూ కొత్త దంపుతుల్లా కాపురం వెలిగించవచ్చు!"

తల్లి ఆయన్ను తను అన్నమాటలకు బాగా చివాట్లు పెట్టటంతో. ఆ అక్కసునంతా వ్యంగ్యంగా తల్లి మీదకు సంధిస్తూ తృప్తి పడసాగింది శశిరేఖ.

"నేనెందుకు వెళతానే అక్కడకు?" అన్నది కూతురి మాటలకు ముఖానికి గంటు పెట్టుకుంటూ. "నేనే ఆ యింటి నుంచి బయిటకు వస్తే వెళ్ళేదాన్నేమో బ్రతిమలాడో, బామాడో... నన్ను ఆయన మెడ పట్టుకు బయిటకు గెంటారు. ఇక నేను ఆ యింటికి వెళ్ళే ప్రసక్తే లేదు... ఇంపాజిబుల్... నేను అంత గతిలేని దాన్ని కాదు ఆయన ఇంటినుంచి వెళ్ళిపొమ్మంటే వెళ్ళిపోవటానికి, రమ్మనమంటే రావటానికి!". ఒక్కక్షణమాగింది తనలోని ఆవేశాన్ని నిగ్రహించు కుంటున్నట్లుగా. గొంతుతగ్గించి, "శుభలేఖ పంపగానే ఆయన తన గౌరవాన్ని నిలుపుకొని నీ వివాహానికి వచ్చారు... అలాగే మన గౌరవం మనం నిలుపుకొని ఆయన్ను గౌరవంగా పంపటం మన విధి... అందుకే నువ్వు చేసిన తప్పును సరి దిద్దుకునేటందుకే ఇప్పుడు నేను నిన్ను స్టేషన్‌కు తీసుకు వచ్చింది... అంతేగాని ఆయనతో వెళ్ళి కాపురం వెలగబెట్టేటందుకు గాదు!" అన్నది కఠినంగా కూతురు వంక చూస్తూ.

"అయితే ఆయనే వచ్చి నీ దగ్గర వుంటానంటే ఆహ్వానించి అందలమెక్కిస్తావా ఏమిటి ఖర్మ!... అసలు నాకు పొద్దుటినుంచీ నిన్ను చూస్తుంటే అనుమానంగానే వున్నది... నీ జీవితాన్ని నిప్పుల్లో పోసిన ఆయన రాగానే ఆనంద పడటం, ఆయన మీద ఈగను గూడా వాలనివ్వక పోవటం చూస్తుంటే ఆలాంటిదేదో చేసేలానే వున్నావు!" అన్నది మరింత కవ్వింపుగా, తల్లి కోపాన్ని ఏమాత్రం పట్టించుకోకుండా, ఆమె ముఖంలోకే ఎగతాళిగా చూస్తూ.

"నాకు ఇప్పటి వరకూ ఆ ఆలోచనే రాలేదు తల్లీ... మీ అమ్మయితే మగతోడు లేకపోయినా ఆడది ఘనంగా బ్రతికేయగలదని ఢంకా కొట్టి మరీ నిరూపించేసింది... కాని, ఆడతోడు లేని మగవాడి బ్రతుకు బహు దుర్భరమని ఈ రెండు సంవత్సరాలల్లో నాకు బాగా అనుభవంలోకి వచ్చింది... అసలు మొగుడూ పెళ్ళాలల్లో ఎవరు గొడుగు పట్టుకున్నా నీడ ఇద్దరికీ వస్తుందనేది నిజం... ఒంటరి కాబోతున్న మీ అమ్మకు నా దగ్గరకు వచ్చి ఉండటానికి మనస్సు అంగీకరించకపోతే...ఒంటరి వాడినయిన నేను

ఆమె దగ్గరికి వచ్చి ఉండటానికి నాకేం అభ్యంతరం లేదు... అదీ ఆమెకు అభ్యంతరం లేకపోతే!" అన్నాడు వెంకట సుందర సత్య రమణమూర్తి.

అందరూ ఆ మాటలు వింటూనే ఉలిక్కిపడి ముఖాలు వెనక్కు తిప్పి చూచారు- తాము మాటల్లో పడి ఆయన ఎప్పుడు అక్కడకు వచ్చిందీ గమనించనే లేదు!

జనంతో అంత గందరగోళంగా వున్న ప్లాట్‌ఫాం ఒక్కసారిగా భయంకరమైన నిశ్శబ్దంలో కూరుకుపోయినట్లని పించింది జానకికి.

అప్పుడే పక్కగా వచ్చి ఆగిన నర్సాపూర్ ఎక్స్‌ప్రెస్ రైలు డీజల్ ఇంజను పెద్దపెట్టున కూసిన కూత- ఆత్మీయుల కోసం తపించిపోతున్న ఓ పసిపిల్లవాడి ఏడుపులా సన్నగా, చిన్నగా ఆమె చెవులకు సోకింది ఆ క్షణాన!

*(ఆంధ్రభూమి: సచిత్ర వారపత్రిక: 03.03.2005)*